నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 23 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



కోటపల్లి : షట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై కప్పిన కవర్లు



జన్నారం : మార్కెట్ యార్డులో భారీ వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



దండేపల్లి : తాళ్లపేటలో తడిసిన ధాన్యం బస్తాలు

# తడిసిన ధాన్యం రైతన్నకు నష్టం

## కొనుగోలు కేంద్రాల్లోనే తడిసి ముద్దవుతున్న వడ్లు

- తూకం వేసి తరలించకపోవడంతో పేరుకుపోతున్న నిల్వలు
- కుప్పల్లోకి వరద చేరి మొలకలు
- ఆరబెట్టేందుకు రైతుల అవస్థలు
- తాళ్లపేటలో విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి
- బైక్‌పై చెట్టు విరిగి పడి మహిళ దుర్మరణం



కాసిపేట : మల్కెపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతులు



దండేపల్లి : మృతిచెందిన ఆవు వద్ద రైతు

దండేపల్లి/జన్నారం/కాసిపేట/జైపూర్/నెన్నెల/చెన్నూర్/కోటపల్లి/దహెగాం, మే 22 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం రాత్రి, గురువారం కురిసిన అకాల వర్షం రైతన్నకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం కష్టపండి పండించిన పంట కండ్లముందే చేతికందకుండా పోతుండగా, అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దండేపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం తడిసింది. తాళ్లపేటలో ధాన్యం బస్తాలు నానిపోయాయి. తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టిన మక్కలను కాపాడుకోవడానికి టార్పాలిన్లు కప్పి ఉంచారు. కొర్విచెల్మలోని 5 పెంకుటిండ్లు, రేకుల షెడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వాటిలో కొన్నింటికి పైకప్పులు, మరికొన్నింటి గోడలు దెబ్బతిన్నాయి. తాళ్లపేటలో గోళ్ల తిరుపతికి చెందిన ఆవు ఇనుప స్తంభానికి తగలగా, షాక్ తగిలి మృత్యు వాత పడింది. విద్యుత్ స్తంభానికి షాక్ వస్తుందని పలుమార్లు అధికారులకు విన్నవిం చుకున్నా పట్టించుకోలేదని, తనకు నష్టపరిహారం అందించా లని కోరాడు. జన్నారం మండలం తపాలాపూర్‌లో బుధవారం రాత్రి అత్యధికంగా 97.8 మీ.మీ వర్షపాతం కురిసినట్లు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి వరద చేరి_ధాన్యం తడిసిపోయింది. మండల కేంద్రం లోని మార్కెట్ యార్డులో తూకం వేసిన ధాన్యం బస్తాలు నానిపోయాయి. ప్రభుత్వం ఎలాంటి షరతులు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాసిపేట మండలం మల్కెపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. వర్షం గెరువు ఇచ్చిందని ధాన్యం ఆరబోయగా, తిరిగి మళ్లీ వర్షం పడడంతో వడ్లు తడిసిపోయాయి. జైపూర్ మండలంలోని పలు గ్రామాల్లోగల కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు, ధాన్యం నింపి ఉన్న బస్తాలు తడిసిముద్దయ్యాయి. కొన్ని కేంద్రాల్లోని వడ్లను పందులు బుక్కాయి. కొన్నిచోట్ల వరదకు వడ్లు కొట్టుకుపోయాయి. జైపూర్‌లోని ఓ డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో లారీల కొరత, మాయిశ్చర్ పేరుతో వడ్లు కాంటా చేయకపో వడంలో ధాన్యం తడిసిపోయింది. నెన్నెల మండలం గొల్లపల్లిలో అకాల వర్షంతో నష్టపో యిన పంటను పరిశీలించేందుకు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ రాగా, రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో వర్షానికి కల్లాల్లోని వడ్లు నాని మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట ఎవరు కొనుగోలు చేస్తారని ఆర్డీవోను ప్రశ్నించారు. ఆర్డీవోహరికృష్ణ మాట్లాడుతూ పంట నష్టంపై సర్వే చేయిస్తామని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏవో పుష్పాల సృజన, ఏఈవో షైనీ ఉన్నారు. చెన్నూర్‌లో బుధవారం రాత్రి గాలి వానకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలి గింది. గురువారం ఓ మోస్తారు వర్షం కురిసింది. కోటపల్లి మండలం షట్‌పల్లి, ఆలుగామ, దేవుల వాడలోని కేంద్రాల్లో వడ్ల సేకరణలో జాప్యమవుతుండగా, ధాన్యం నిల్వలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి. మండలంలో 60 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 18 వేల క్వింటాళ్లు మాత్రమే సేకరించారు.



కాసిపేట : తడిచిన ధాన్యం బస్తాలను ఆరబెడుతున్న రైతులు



జైపూర్ : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని బుక్కుతున్న పందులు



నెన్నెల : గొల్లపల్లిలో తడిసిన వడ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

## బైక్‌పై చెట్టు విరిగి పడి మహిళ మృతి

జన్నారం, మే 22 : వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో భారీ వర్షానికి చెట్టు విరిగి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మహ్మదాబాద్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. దండేపల్లి మండలం వెంకటాపూర్‌గ్రామానికి చెందిన బార్యభర్తలు శనిగారపు సునీత(37)–జగన్ బైక్‌పై కడెం మండలం లింగపూర్‌లో బుధవారం జరిగిన పెండ్లికి హాజరయ్యారు. వర్షంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మహ్మదాబాద్ వద్దకు రాగానే రోడ్డుపక్కనున్న చెట్టు విరిగి బైక్‌పై పడడంతో వెనకాల కూర్చున్న సునీతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె భర్త జగన్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరిద్దరినీ లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే సునీత మృతి చెందినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. జగన్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి తండ్రి చెవులమద్ది శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.



## నిండా మునిగిన

పెగడపల్లి శివారులోని రెండెకరాల్లో వరి వేసిన. నీళ్లు అందక పంట దిగుబడి సరిగా రాలే. వచ్చిన వడ్లను అమ్ముకుందామని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే వడ్లు తడిసినయి. గీ వర్షం ఇంత ముంచింది. అటు పందులు కూడా బుక్కినయి. పదిహేను రోజుల నుంచి లారీలు లేవు. మాయిశ్చర్ లేదు అంటూ తిప్పుకుంటున్నరు తప్ప కొన్నది లేదు. అన్ని రకాలుగా నష్టపోయి నం. సర్కారోళ్లు మమ్ముల ఆదుకోవాలే.

– మామిడాల రాజేందర్, రైతు, పెగడపల్లి, జైపూర్

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి భరోసా అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెరమెరి మాజీ జడ్పీటీసీ దుర్పతాబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, రెబ్బెన మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, ఆనంద్, అఫ్రోజ్ అలీ పాల్గొన్నారు.

### వీరాంజనేయ ఆలయంలో పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శిరీశ్ శర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హోమం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, బీజేపీ నాయకుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఇప్పించండి సారూ..!

### ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వృద్ధ దంపతుల ప్రదక్షిణ

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధ దంపతులు మడావి భీము, అంబుబాయి. ఊరు ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గుండ్లపాడ్. వీరికి గతంలో రేషన్ కార్డు ఉండగా, అధికారులు దానిని తొలగించారు. ఇంట్లో ఉద్యోగస్తులు లేకున్నా.. ఉన్నారని రద్దు చేయగా, వీరు అవస్థలు పడుతున్నారు. నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమకు 'రేషన్ కార్డు ఇప్పించి జర పుణ్యం కట్టుకోండి సారూ..' అంటూ కనబడిన అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వేడుకుంటున్నారు. కాలు కదుపలేని వయసులో ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికైనా సార్లు స్పందించి తమ గోస తీర్చాలని కోరుతున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ భవనం వద్ద దీనంగా కూర్చున్న ఈ వృద్ధ దంపతులను చూసి పలువురు సానుభూతి వ్యక్తం చేశారు.

– కాసిపేట, మే 22



వృద్ధ దంపతులు మడావి భీము-అంబుబాయి

## విజ్ఞాన నిలయం నిరుపయోగం



తాళ్లపేటలో లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్(ఫైల్)

- తాళ్లపేటలో తెరుచుకోని లైబ్రరీ
- కేసీఆర్ సర్కారులో ప్రారంభం
- నేడు పట్టించుకునే వారు లేక మూసి ఉంటున్న గ్రంథాలయం
- ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్న విద్యార్థులు, ఉద్యోగార్థులు

దండేపల్లి, మే 22 : యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ సర్కారు పల్లెల్లో పబ్లిక్ లైబ్రరీలు ఏర్పాటు చేసింది. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టి అందులో గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చి రీడింగ్ కల్చర్‌ను ప్రోత్సహించింది. కానీ.. ప్రస్తుత పాలకులు వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

### బీఆర్ఎస్ సర్కారులో ప్రారంభం

2023 జూన్ 20న దండేపల్లి మండలం తాళ్లపేటలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ భవనానికి రూ 3.50 లక్షలతో మరమ్మతులు చేపట్టి లైబ్రరీగా మార్చారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అప్పటి మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, అడిషనల్ కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు. ఇక్కడేగాక జిల్లాలో అనేకచోట్ల నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను అప్పట్లో కొత్త లైబ్రరీల కోసం వినియోగించారు. ఒక్కో లైబ్రరీ కోసం రూ.3.50 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఆయాచోట్ల వందలాది పుస్తకాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం పట్టించుకునేవారు లేక పలుచోట్ల గ్రంథాలయాలు నిరుపయోగంగా మారాయి.

### వసతులున్నా ఫలితం శూన్యం..

తాళ్లపేటలోని గ్రంథాలయంలో టేబుళ్లు, కుర్చీలు, లైట్లు కూడా ఏర్పాట్లు చేశారు. అన్ని వయసుల వారు చదువుకునేలా లైబ్రరీని తీర్చిదిద్దారు. కానీ.. దీనిని తెరిచి ఉంచకపోవడంతో విద్యార్థులు, యువకులు నిరుత్సాహ పడుతున్నారు. నోటిఫికేషన్‌ల సమయంలో నిరుద్యోగులకు సైతం ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడనున్నది. పాఠకుల అభిరుచి మేరకు మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేసి లైబ్రరీని ప్రతిరోజూ తెరిచి ఉంచాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం లైబ్రరీ కోసం మరమ్మతులు చేపట్టిన ఈ భవనంలోని ఓ గదిలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైబ్రరీని వినియోగంలోకి తేవాలని స్థానికులు, విద్యావేత్తలు కోరుతున్నారు.




నిరుపయోగంగా ఉన్న లైబ్రరీ